కమలాపూర్ సీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

గ్రామ పంచాయతీలో డబ్బు ల్లేవా ?

ఎవరితోనైనా మొరం పోయించాలి ■ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

కమలాపూర్, ఆగస్టు 14 : గ్రామ పంచాయతీలో డబ్బుల్లేవా? ఎవరినైన పట్టుకుని మొరం పోయించాలని అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మండలంలో మలేరియా, డెంగీ, విషజ్వరాలు వస్తుండడంతో బుధవారం కమలాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. దవాఖానలో కలియ తిరిగి రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇస్తున్న మందుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయకపోవడంతో వైద్య సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. హాస్పిటల్‌లో ముగ్గురు డెంగీ జ్వరం బారిన పడిన వారు ఉన్నాయని, సీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో పరకాల దవాఖాన నుంచి డిప్యుటేషన్‌పై వైద్యులతో పనిచేయిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లో ఉన్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి ఆవరణలో మురుగు నీటితో గుంతను చూసిన ఆయన వెంటనే పూడ్చాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని జీపీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీలో డబ్బుల్లేవ్ సార్.. అని అధికారులు అనడంతో ఏంటి గ్రామపంచాయతీలో డబ్బుల్లేవా? ఎవరినో ఒకరిని పట్టి మట్టి పోయించి గుంతను పూడ్చాలన్నారు. వేస్టేజీ మందుల చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో బాబు, దవాఖాన సూపరింటెండెంట్ నరేశ్, ఎంపీవో రవి తదితరులు ఉన్నారు.

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి నియామకంపై విచారణ

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఆదేశాలు జారీ

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 14 : కేయూ ప్రస్తుత రిజిస్ట్రార్ మల్లారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకం కావడంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో విచారణ జరిపి నివేదిక పంపాలని ఈ నెల 7న ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. 'యూజీసీ నిబంధనల మేరకు మల్లారెడ్డికి ఐదేండ్ల బోధన, పరిశోధన అనుభవం లేదు. నాలుగేండ్ల డాక్టరల్ పరిశోధన అనుభవం మాత్రమే ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రత్యక్ష నియామకానికి అర్హత లేదు. అప్పటి వీసీ మల్లారెడ్డితో కుమ్మక్కై, నిబంధనలను ఉల్లంఘించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించారు' అని హనుమకొండకు చెందిన కేఎన్ రెడ్డి ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. మల్లారెడ్డి రిజిస్ట్రార్ పదవికి అనర్హుడని అతడిని వెంటనే తొలగించాలని కోరారు. ఆయనను పోస్టులో కొనసాగిస్తే రికార్డులు మార్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ముస్తాబు చేశారు.. నిర్వహణ మరిచారు..

ఆత్మకూరు, ఆగస్టు 14 : ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి కట్టించిన అంగన్‌వాడీ కేంద్రం నిరుపయోగంగా మారింది. మండలంలోని గూడెప్పాడ్‌లో 4 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. నలుగురు అంగన్‌వాడీ టీచర్లు, నలుగురు ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు సెంటర్లలో మొత్తం 20 మంది పిల్లలు ఉన్నారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని ఒక దగ్గర ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో నాలుగు కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. కానీ నిర్వహణ మాత్రం మరిచారు. మూడు నెలలైనా ప్రభుత్వ పాఠశాల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ఆ భవనంలోకి మార్చలేదు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ముస్తాబు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

త్వరలో అందుబాటులోకి ప్లేట్‌లెట్ కౌంట్ మిషన్ : కలెక్టర్ ప్రావీణ్య ■ పరకాల దవాఖాన తనిఖీ

పరకాల, ఆగస్టు 14 : రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసి మందులు, రోగులకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, విష జ్వరాల కట్టడికి అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. జ్వరాలకు అవసరమైన ర్యాపిడ్ టెస్టులను దవాఖానలోనే నిర్వహిస్తామని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్లేట్‌లెట్ కౌంట్‌ను నిర్వహించే మిషన్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్ పాల్గొన్నారు.

పరకాల : వైద్యులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గడువులోగా పనులు చేయాలి

హనుమకొండ : కలెక్టర్ ప్రావీణ్య బుధవారం బాల సముద్రంలోని కళాకళాక్షేత్రాన్ని సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించారు. పెయింటింగ్స్, టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబర్, ఫ్యాబ్రికేషన్, లాన్ తదితర పనులను పరిశీలించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కుడా ఈఈ భీంరావు, పీవో అజిత్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ కావ్య

కలెక్టర్ ప్రావీణ్యను బుధవారం ఎంపీ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఎంపీ పూల మొక్కను అందజేసారు. హనుమకొండ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులతో పాటు జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో ఎంపీ ఈ సందర్భంగా చర్చించారు.

జ్వరాల కట్టడికి కృషి..

సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరకాలలో 100, కమలాపూర్‌లో 70 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయని, వారికి దగ్గర్లోని పీహెచ్‌సీల్లో ర్యాపిడ్ టెస్టులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో మొత్తం 2200 ఓపీలు నమోదయ్యాయని, 650 కేసులు సాధారణ జ్వరంగా నమోదు అయ్యాయని, వీరందరూ పారాసెటమాల్ మందులతో కోలుకున్నారని తెలిపారు. మున్సిపాలిటీ ప్రాంతాల్లో పారిశుధ్యం, శానిటేషన్ చేయించామన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీపీవో రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 14 : జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాంరెడ్డి తెలిపారు. అక్టోబర్ 13 వరకు https://telanganaepass.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జెండా పండుగకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

హనుమకొండ, ఆగస్టు 14 : స్వాతంత్ర్య వేడుకలకు హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ ఉదయం 9.30గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రసంగిస్తారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకిస్తారు. వేడుకలకు వీఐపీలు, విద్యార్థులు, ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.

ఎక్సైజ్ కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక

హనుమకొండ, ఆగస్టు 14 : హనుమకొండ ఎక్సైజ్ కాలనీ అభివృద్ధి కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రామ్మోహన్, నారాయణ, చిరంజీవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రవీందర్ ఎన్నికయ్యారు. గతంలో ఎక్సైజ్ కాలనీ అభివృద్ధి కమిటీలో పనిచేసిన వారు ఎంతో కృషి చేశారని, ముఖ్యంగా ప్రభుత్వ ఖాళీ స్థలాలు దురాక్రమణకు గురికాకుండా చూశారని, అదే కోవలో నూతన కార్యవర్గం పనిచేయాలని కాలనీవాసులు ఆకాంక్షించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

వరంగల్ లీగల్, ఆగస్టు 14 : ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ సంఘం రాష్ట్ర నాయకుడు పొన్నం దేవారాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. వరంగల్ బార్ అసోసియేషన్‌లో బార్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అంబరీష్‌రావు, తాల్లపల్లి జనార్దన్ గౌడ్, చిల్లా రాజేంద్రప్రసాద్, ఆనంద్ మోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకులు మాధవకృష్ణ, ఎస్ నరేందర్, నరహరి, పీ సుదర్శన్, లడే రమేశ్, శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళ ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూరు, ఆగస్టు14 : మహిళను వేధించిన యువకుడిపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ఓ వివాహిత (23)ను అదే గ్రామానికి చెందిన కుండే ప్రశాంత్ నెల రోజుల నుంచి నిత్యం వేధిస్తున్నాడు. భర్త లేని సమయంలో ఆమెతో అసభ్యకరంగా మాట్లాడుతూ తనను ప్రేమించాలని సిగరెట్లతో తాను కాల్చుకుంటూ వేధించేవాడు. తనతో ఫొటోలు దిగాలని వివాహితపై ఒత్తిడి చేయగా వివాహిత ఫొటోలు దిగింది. ఆ తర్వాత ఆ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి తీవ్రంగా వేధింపులకు గురిచేస్తుండగా తన భర్తకు జరిగిన విషయం చెప్పింది. మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ

పరకాల, ఆగస్టు 14 : రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలోకి చొరబడి అమ్మవారి ముక్కుపుడకను దొగలించిన ఘటన పట్టణ శివారులో జరిగింది. పోలీసులు, ఆలయ బాధ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటి వనంలోని రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి అమ్మవారి ముక్కు పుడుకతో పాటు హుండీలోని డబ్బును అపహరించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు : ఎమ్మెల్యే

పరకాల, ఆగస్టు 14 : పరకాల పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీలో పట్టణ అభివృద్ధిపై అధికారులు, పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత-రామకృష్ణ, వైస్ చైర్మన్ విజయపాల్‌రెడ్డి, కమిషనర్ నర్సింహ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

మొక్కను నాటుతున్న దాస్యం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

న్యూశాయంపేట, ఆగస్టు 14 : అన్నమనేని మేఘాన్ష్ రావు జ్ఞాపకార్థం హంటర్ రోడ్‌లోని ఏకశిల వృద్ధాశ్రమంలో అభిషేక్ ఆధ్వర్యంలో వృద్ధులకు వస్తువుల పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేఘాన్ష్‌రావు, అభిషేక్ ప్రతీ సంవత్సరం వందల సంఖ్యలో మొక్కలు నాటేవారన్నారు. పర్యావరణాన్ని రక్షించడానికి పాటుపడాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులి రజనీకాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, నాయకులు జోరిక రమేశ్, కోటేశ్వర్‌రావు, మూర్తజా, బుద్ది వెంకన్న, రఘు, ప్రణయ్, రాకేశ్ యాదవ్, స్నేహిత్ పాల్గొన్నారు.

హనుమకొండకు ఇంటర్ ఆర్జేడీ

ఇంటర్ విద్యా డైరెక్టర్ శృతి ఓజా ఉత్తర్వులు జారీ

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 14 : ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) తిరిగి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభించనున్నారు. గత సంవత్సరం ఇంటర్ ఆర్జేడీని హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు తరలించి ఇక్కడ పనిచేసే 14 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులు, సిబ్బందికి ఇతరచోట్ల పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆర్జేడీ జయప్రద బాయి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాదగిరి ఆన్ డ్యూటీపై హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలోనూ అక్కడి నుంచే వరంగల్ ఆర్జేడీ పాలన కొనసాగించారు. విషయాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల అధ్యాపకుల సంఘం, పెన్షనర్ల సంఘం బాధ్యులు, ప్రజాప్రతినిధులు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, హైదరాబాద్ నుంచి ఈ కార్యాలయాన్ని వెంటనే తరలించాలని ఇంటర్ విద్యాశాఖ అధికారి శృతిఓజా ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జేడీ జయప్రదబాయి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాదగిరిని వరంగల్ ఆర్జేడీ ఆఫీస్‌లోనే విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నూతన భవనంలో ఆర్జేడీ ఆఫీస్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో పనిచేసిన నాన్‌టీచింగ్ ఉద్యోగులకు సైతం రీపోస్టింగ్ ఇవ్వనున్నట్లు సమాచారం.

ప్లేట్‌లెట్స్ తగ్గుతున్న పేషెంట్ల వివరాలు ఇవ్వాలి

వరంగల్, ఆగస్టు 14 : సీజనల్ వ్యాధులు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ దవాఖానలకు వచ్చే పేషెంట్లలో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు డీఎంహెచ్‌వో కార్యాలయానికి అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్ఐ ఏజీ పాజిటివ్ వచ్చిన ప్రతి కేసును డెంగీగా నిర్ధారించకుండా ఎలిసా టెస్టు కోసమే ఎంజీఎం దవాఖానకు పంపించాలని సూచించారు. హాస్పిటళ్లలో అందించే సేవలు, బెడ్ చార్జీలు, ఇతర సేవలకు అయ్యే ఖర్చుల ధరల పట్టికను తప్పనిసరిగా అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు.

రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ

హసన్‌పర్తి, ఆగస్టు 14 : గ్రేటర్ ఒకటో డివిజన్ ముచ్చర్లలోని వెంకటేశ్వర రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీ చేపట్టారు. బియ్యాన్ని పరిశీలించి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీటీ నాగేంద్రప్రసాద్ రైస్ మిల్లులోని బియ్యాన్ని పరిశీలించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యమా? లేక పీడీఎస్ బియ్యమా? అని తేల్యేందుకు కొంత బియ్యాన్ని టెస్ట్‌కు పంపించారు. రిపోర్ట్ వచ్చిన వెంటనే దాని ప్రకారం రైస్ మిల్లుపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 14 : 25 క్వింటాల పీడీఎస్ రైస్ పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వనమాలకనపర్తి గ్రామ శివారులో అక్రమంగా గూడ్స్ వాహనంలో పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించారు. వాహనంలో రూ.50 వేల వరకు విలువైన 59 బస్తాల్లో నింపిన సుమారు 25 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి శాయంపేట ఎంజేపీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

శాయంపేట, ఆగస్టు 14 : శాయంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల విద్యాలయం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఈ నెల 16, 17 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బ్రహ్మం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. శాయంపేటలో ఎంజేపీ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. వేడుకలకు 1200 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ నెల 16న జరిగే ప్రారంభ వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎంజేపీ గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు నరేందర్, నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న కోఆర్డినేటర్ బ్రహ్మం, పూర్వ విద్యార్థులు

'పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోం'

వరంగల్, ఆగస్టు 14 : పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. బుధవారం కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ తీరుపై ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్య సంబంధిత అంశాలపై క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త తరలింపు సమయంలో వాహనాలపై కవర్లు కప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పక్కా ప్రణాళికతో పనులు చేయించాలన్నారు. సీఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న గ్రేటర్ కమిషనర్

బల్దియాకు 26 మంది ఉద్యోగులు

ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా బల్దియాలో 26 మంది అటెండర్లు, పారిశుధ్య కార్మికులు, పంప్ ఆపరేటర్లు పరకాల మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. వారంతా డిప్యూటేషన్‌పై తిరిగి బల్దియాకు వచ్చారు. బుధవారం కార్పొరేషన్‌లో జాయిన్ అయ్యారు. దీనిపై కార్మిక సంఘాల నాయకులు కమిషనర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు బొట్ల భిక్షపతి, ఏల్పుల ధర్మరాజు, సారంగపాణి, ఆర్ భాస్కర్, మోరె రమేశ్, రఘు, మూర్తిరాజు, బొక్క ఏలియా ఉన్నారు.

జర్నలిస్ట్ యోగికి ఎమ్మెల్యే నాయిని నివాళి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 14 : ఇటీవలే మరణించిన జర్నలిస్ట్ యోగిరెడ్డి, ఆయన కూతురు ఆద్యరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రెస్‌క్లబ్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు. యోగి మరణం తనను చాలా బాధించిందన్నారు. యోగిరెడ్డి, ఆద్యరెడ్డిల ఆత్మలకు శాంతి చేకూరాలంటూ జర్నలిస్టులతో కలిసి 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ పాలకవర్గం

హనుమకొండ, ఆగస్టు 14 : గవర్నర్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మను బుధవారం రాజభవన్‌లో జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. భద్రకాళీ కండువా, ప్రధానమంత్రితో దిగిన తన ఛాయాచిత్ర పటాన్ని గవర్నర్‌కు బహూకరించారు. తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ స్టోర్‌ను వినియోగించుకోవాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా

స్టోర్‌ను ప్రారంభిస్తున్న సీపీ

సుబేదారి, ఆగస్టు 14 : హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు వెల్ఫేర్ కన్జ్యూమర్ స్టోర్‌ను ప్రారంభించి వస్తువులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. పోలీసు సిబ్బందికి నాణ్యమైన నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు అందించేందుకు స్టోర్ ఏర్పాటు చేశామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తుల కానుకలు.. మల్లన్నకే ఎరుక..

అర్చకులు..అధికారుల మధ్య లోపించిన సమన్వయం

ఐనవోలు, ఆగస్టు 14 : ఐనవోలు మల్లన్న ఆలయానికి భక్తులు ఖరీదైన కానుకలు సమర్పించినా సరైన ఆదరణ, ప్రాధాన్యత కల్పించడం లేదు. అధికారులు, అర్చకుల ప్రమేయంతో కానుకలు చేయిస్తేనే ప్రాధాన్యత దక్కుతున్నది. కనీసం స్వామి వారి దర్శనం కూడా కల్పించడం లేదని పలువురు దాతలు ఆవేదన వ్యక్తం చేసినా ఇప్పటికీ అధికారుల, అర్చకుల తీరు మారకపోవడం శోచనీయం.. ఓ భక్తుడు గర్భాలయం లోపల రూ.లక్షలు వెచ్చించి ఇత్తడి తొడుగు చేయించాడు. కానీ కనీసం ఆ భక్తుడు ఎవరు? ఎంత సొమ్ము వెచ్చించాడో ఇప్పటి వరకు తెలుపలేదు. గతంలో ఓ అర్చకుడు దాతల విరాళాలను గోప్యంగా ఉంచి, లబ్ధి పొందాడని ఆరోపణలు రావడంతో విచారణ అధికారులు ఆ అర్చకుడిని ఆరు నెలలు సస్పెండ్ చేశారు. గీసుకొండకు చెందిన తాటికొండ మల్లేశం రూ.10 లక్షలు వెచ్చించి రథం తయారు చేసి ఆలయానికి అప్పగించాడు.. ఇలా ఎంత మంది భక్తులు ఏమేమి సమర్పిస్తున్నారో.. వాటికి సంబంధించిన లెక్కలు ఉన్నాయో లేదో మల్లన్నకే ఎరుక ? అని భక్తులు చర్చించుకుంటున్నారు.

నిట్‌లో ప్లాంటేషన్ డ్రైవ్, ర్యాలీ

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 14 : నిట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఏక్ పౌద్ మాకే నామ్